# మెటీరియలిస్ట్

– కె.ఎస్.ఎస్. ప్రసాద్ చౌదరి

సాయంత్రం అయిదయింది. జనాలు గుంపులు గుంపులుగా రోడ్ల మీద కదిలిపోతున్నారు. ఆఫీసు అయిన వెంటనే 'నివేదిత' ఫ్లాట్ చేరుకొనేందుకు త్వరత్వరగా నడుస్తోంది. వీకెండ్ కావడంతో మరుసటిరోజు సెలవును ఎలా 'యుటిలైజ్' చేయాలా అని మనసులోనే ఆలోచిస్తూ వుంది.




సిటీబస్ ఎక్కి అపార్ట్‌మెంట్ చేరుకొనేసరికి ఆమెకి గంట టైమ్ పట్టింది. ఆమె ఒక ప్రైవేట్ ఫర్మ్‌లో సి.యస్.గా పనిచేస్తోంది. చదివిన చదువుకు సార్థకత చేకూర్చాలన్న కోరికతో, ఆర్థికంగా స్వతంత్రురాలిగా వుండాలన్న పట్టుదలతో తల్లితండ్రులను ఒప్పించి దూరంగా వున్న రాజధానికి వచ్చి జాబ్‌లో చేరింది. అదే సమయంలో ఆమె బాల్య స్నేహితురాలైన మల్లికకు యూనివర్శిటీలో మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్‌లో పిహెచ్‌డి సీట్ రావడంతో ఇద్దరూ కలిసి ఒక అపార్ట్‌మెంట్‌లో అద్దెకు చేరారు.

నివేదితది గంభీరమైన మనస్తత్వం. నెమ్మదిగా కనిపించినా స్థిరమైన అభిప్రాయాలతో కూడిన వ్యక్తిత్వం గలది. దానికి తోడు మంచి అందమైనది. మల్లికది ముక్కుసూటి మనస్తత్వం. ఎప్పుడూ గలగలా మాట్లాడుతూ వుంటుంది. రీసర్చ్ స్కాలర్‌గా వున్నా డిగ్రీ చదివే పిల్లలా వుంటుంది. కానీ వారిద్దరి మధ్య గల అపురూపమైన స్నేహంకు భిన్న మనస్తత్వాలు ఎప్పుడూ అడ్డుకాలేదు.

ఎవరు ముందు అపార్ట్‌మెంట్‌కు వస్తే వారు' వంట బాధ్యత స్వీకరిస్తూ వుండడం సాధారణంగా జరుగుతుంటది. కానీ మల్లిక రీసర్చ్‌లో భాగంగా సెమినార్లకు అటెండ్ కావాల్సి రావడంతో తనకి ప్రయాణాలు తప్పనిసరి అయ్యాయి. ఎక్కువ టైమ్ తీసుకునే ప్రయోగాలు లాబ్‌లో జరుగుతుంటాయి. అందువల్ల మల్లిక రాకపోకలకు సరైన సమయమంటూ వుండేది కాదు. ప్రస్తుతం మల్లిక సెమినార్‌కు అటెండ్ కావడం కోసం మద్రాస్ వెళ్ళింది.

తలుపు తీసి లోపలికి అడుగుపెట్టిన నివేదిత దృష్టిని ఒక గులాబీ రంగు కవర్ ఆకర్షించినది. దాని రంగు, వాసన చూడగానే రుచి గురించి తేలికగా చెప్పగలిగేట్లు వుంది. చించి లోపలి మాటర్ చదవగానే ఆమె భృకుటి ముడిచింది. చివర సంతకం లేని ఆ ప్రేమలేఖ ఎవరి నుంచి వచ్చి వుంటదో ఆమెకు అర్థంకాలేదు. స్వంత ఊరిలో అమ్మానాన్నలకు తప్ప తన అపార్ట్‌మెంట్ అడ్రస్ ఎవరికీ తెలీదు.

స్నేహితులలో మల్లిక తప్ప మరెవరితోనూ అంత టచ్‌లో లేదు. సో, ఇక తప్పనిసరిగా అది తన ఆఫీస్ నుండే వచ్చి వుంటది అని అనుకున్నది. మల్లికతో ఈ విషయం గురించి ఓసారి మాట్లాడిన తర్వాత ఆ విషయం కన్‌ఫార్మ్ చేసుకోవాలని నిర్ణయించుకున్నది. వంట ముగించి కాసేపు టి.వి. చూస్తూ కూర్చుంది. సాయంత్రం మద్రాస్ నుండి వచ్చేస్తానని ఆఫీస్‌కి ఫోన్ చేసిన మల్లిక 7-30 అయినా రాకపోవడంతో ఆమె కోసం. ఎదురుచూస్తూ కూర్చుంది.

క్రింద ఏదో గొడవగా వున్నట్లు మాటలు వినబడుతుండటంతో నివేదిత సెకండ్ స్టెయిర్‌లో వున్న తన అపార్ట్‌మెంట్ నుండి తొంగి చూసింది. అక్కడ మల్లిక ఆటోవాడితో తారాస్థాయిలో గొడవ పడుతోంది. నివేదిత త్వరత్వరగా మెట్లు దిగి క్రిందకి వెళ్ళి సర్దిచెప్పి మల్లికను అపార్ట్‌మెంట్‌లోకి తీసుకువచ్చేసరికి ఆమెకు పది నిముషాలు పట్టింది. ఎక్స్‌ట్రావర్ట్ అయిన మల్లికకు అలాంటి చిన్న చిన్న గొడవలు రావడం కొత్త కాదు. నివేదిత ఎన్నిసార్లు చెప్పినా తన పద్ధతి మల్లిక మార్చుకోకపోవడంతో తన మానాన తనని వదిలివేయడం మంచిది అని నిర్ణయించుకున్నది. కళ్ళముందు ఎవరికో జరిగే అన్యాయాలను ఎదిరించడం సంగతి అటుంచి, తమకే జరిగే అన్యాయాన్ని కనీసం ప్రశ్నించడం నేర్చుకోడం తప్పు కాదని మల్లిక అభిప్రాయం. అందుకే ఆమె తరచుగా చిల్లర డబ్బులు కోసం బస్ కండక్టర్‌తో, యూనివర్శిటీలో మామూళ్ళు అడిగే స్కాలర్‌షిప్ క్లర్క్‌తోను, కామెంట్స్ చేసేవాళ్ళతోను గొడవ పడుతుంటది.

xxx

స్నానం, భోజనం చేసి, కొంచెంసేపు సెమినార్స్‌లో సబ్‌మిట్ చేసి వచ్చిన పేపర్స్ ఫోటోస్టాట్‌లు సరిచూసుకొని ఒక ఆర్డర్‌లో పెట్టి, కొన్ని కరెక్షన్స్ చేసి ఫైల్‌లో పెట్టి వచ్చి టి.వి. ముందు కూర్చున్న మల్లికకు తనకు వచ్చిన లెటర్‌ను అందించినది నివేదిత.

"ఏమిటే ఇది?" ఆశ్చర్యంగా అడిగింది మల్లిక.

"తీసి చూడు" ముక్తసరిగా అంది నివేదిత.

"ఏదో లవ్‌లెటర్‌లా వుంది కదే! నీకా, నాకా?"

"యక్ష ప్రశ్నలు ఆపి తీసి చూడు. నీకే తెలుస్తుంది"

"నీ కొచ్చిన లవ్‌లెటర్ నాకిస్తావెందుకు?" ఉడికించడానికి అంది మల్లిక.

"చంపేస్తాను నిన్ను. మాట్లాడకుండా చదువు" అంది నివేదిత.

లెటర్‌లో నివేదితను సంబోధిస్తూ "My dear companion of hearts and lungs" అన్న వాక్యాన్ని చూసి

"గురుడు చలం 'ప్రేమలేఖలు' చదివినట్లున్నాడు. కాపీ కొట్టి రాసినా సరైన అడ్రస్‌కే రాశాడు. మంచి 'పొయిటిక్' ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చాడు. అంత తేలికగా తీసిపారేయదగ్గ వ్యక్తి కాదు" అంది మల్లిక.

"పొయిటిక్‌గా రాసిన ప్రతివాడినీ లవ్ చేయాలంటే ఈ లోకంలో ఏ కవీ 'ఏకపత్నీవ్రతుడిగా మిగలడు' అంది నివేదిత.

"నిన్ను ప్రేమించమని నేనెపుడన్నానే"

"నాకు లవ్‌లెటర్ రాసిన వాడిని నువ్వు మెచ్చుకుంటున్నావంటే పరోక్షంగా దానర్థం ఏమిటి?"

"నువ్వు 'లా' చదివి వుంటే రాం జెత్మలానీ కూతురు రాణి జెత్మలానీ అంత పేరు పొందేదానివే" అంది మల్లిక.

"అంత సీన్ లేదులేగాని, క్రింద సంతకం చూశావా?"

"ఉండి ఏడిస్తే గదా! ఎవడు రాసి వుంటాడే?"

"అది అర్థంగాకేగా ఈ ఏడుపు. తెలిస్తే పట్టుకొని నాలుగు దులపనూ"

"అది తెలిసే పేరు రాసి వుండదులే. అయినా అంత భావుకతతో రాస్తే తిడతానంటావేమిటి?"

"లేకపోతే ముద్దు పెట్టుకోమని సలహా ఇవ్వరాదూ నువ్వు" అంది కసిగా నివేదిత.

"ఏం సలహా చెప్పాలన్నా ముందు గురుడెవరో తెలియాలి గదే. నీ అడ్రస్ ఆఫీస్‌లో వారికి తప్ప అన్యులెవరికీ తెలిసే అవకాశం లేదు కాబట్టి ఇది వాళ్ళపనే అయి వుంటది" నిర్ధారణగా అంది మల్లిక.

"మా ఆఫీస్‌లో పనిచేసేది ఎం.డి.తో కలిపి తొమ్మిది మంది. అందులో నాతో కూడా ముగ్గురు ఆడవాళ్ళు. మిగిలిన ఆరుగురిలో ముగ్గురు వివాహితులే. ఇతగాడి వాలకంబట్టి చిన్నిల్లు కోసం తాపత్రయపడే వ్యక్తిలా లేదు. సో, ఇంక మిగిలిన ముగ్గురులో ఎం.డి. వరుణ్, రవి, కుమార్‌లు. వీళ్ళల్లో కూడా మా ఎం.డి. ఎప్పుడూ డబ్బు సంపాదన, పని తప్ప ఇతర విషయాలు పట్టించుకోడు. ఆ జీవి నువ్వన్నట్లు ఇంత పొయిటిక్‌గా రాస్తాడని అనుకోడంకన్నా తెలివితక్కువతనం మరోటి వుండదు" అంది నివేదిత.

"అతను రాయలేకపోయినా తన కోసం మరెవరిచేతనైనా రాయించి వుండవచ్చు కదా?" సాలోచనగా అంది మల్లిక.

"నా కన్నా నువ్వు 'లా' చదివి వుంటే ఫాతిమాబీబీ అంత అయిందేదానివే. అయినా ప్రేమలేఖలు ఇతరుల కోసం కిరాయికి రాసే వాళ్ళు, రాయించుకునేవాళ్ళు కూడా వుంటారా?"

"ఎవరిదాకో ఎందుకు, పి.జి. చదివేపుడు నా రూమ్‌మేట్స్ ఇద్దరికి నేను లవ్‌లెటర్స్ రాసిపెట్టానని చెప్పాను గదే! గుర్తులేదా?" నిష్టూరంగా అంది మల్లిక.

"గుర్తులేకేం! మైక్రోబయాలజీ భాషలో నువ్వు రాసిన ఆ ప్రేమలేఖలు చదివి యూనివర్శిటీ కాంపస్‌లో మరి ఏ ఇతర అమ్మాయి వంక చూడాలన్నా భయపడిపోయిన ప్రియుళ్ళను తలచుకొని నీ రూమ్‌మేట్స్ ఆడ దేవదాసులుగా మారిపోయారనుకుంటానే" నవ్వుతూ అంది నవేదిత.

బుంగమూతి పెట్టి అలిగిన మల్లికను సముదాయించి "వూరికినే అన్నాను లేవే. అసలు విషయంలోకి రా" అని అంది నివేదిత.

"అయితే నీకు మీ ఎం.డి. మీద డౌట్ లేదంటావు. అంతేనా?"

"ఆ అంతరిక్ష జీవికి అంతటి టేస్ట్ వుంటుందని నాకనిపించడంలా"

"అంతరిక్ష జీవా! అదేం పేరే. ఇంకా పేర్లేమీ దొరకలేదా వాళ్ళమ్మకు. ఆ పేరు పెట్టింది"


"అది నేను పెట్టిన నిక్‌నేమ్‌లేవే! ఎప్పుడూ ఏదో లోకంలో విహరిస్తున్నట్టు రోదసీలో ఒంటరిగా 'మిర్' స్టేషన్‌లో కాపురం చేస్తున్న రష్యన్ 'ఆస్ట్రోనాట్'లా తన రూమ్‌లో వుంటాడు ఆ మానవుడు" అంది నివేదిత.

"ఊ బాగానే స్టడీ చేసినట్టున్నావు మీ ఎం.డి.ని. సర్లే నాకు నిద్రొస్తోంది. ఈ రోజుకు పడుకుందాం. రేపు మళ్ళీ మన ఇన్‌వెస్టిగేషన్ ప్రారంభిద్దాం" అని ముసుగుపెట్టింది మల్లిక.

xxx

నిద్ర పట్టక బెడ్ మీద అటూ ఇటూ దొర్లుతోంది నివేదిత. తను ప్రొద్దున చదివిన లెటర్‌లోని వాక్యాలే ఆమెకు పదే పదే గుర్తుకువస్తున్నాయి.

"... ... పట్నం వచ్చి ఆరు సంవత్సరాలు దాటినా ఇంకా పల్లెటూరి వాసనలు పోని మా అమ్మ



ప్రొద్దున్నే లేచి, నగరపు కాలుష్యం వాసనలకు దూరంగా వున్న కాలనీలో ఇంటి ముందు భూదేవి నలుగుబెట్టి కళ్ళాపి స్నానం చేయించి 'ముగ్గు బొట్టు' పెట్టింది. అప్పడే తన మొద్దు నిద్ర లేచి కళ్ళు నులుముకుంటూ ఏడు గుర్రాలు గుచ్చిన రథం మీద లోక సంచారానికి బయలుదేరిన సూరీడు స్నానం చేసి అప్పటిదాకా నగ్నంగా వున్న భూమాతకు ఎర్రని వెలుగు చీర చుట్టి తృప్తిగా నవ్వాడు. కట్న కానుకలతో వదల్లేక వదల్లేక పుట్టిల్లు వదిలి మెట్టినింట అడుగుబెడ్తున్న పెళ్ళికూతురి నడకలాంటి మందగమనంతో ఎక్కడనుంచో ముంచుకొచ్చిన కారుమబ్బులు చిరుజల్లులతో ఆహ్లాదాన్ని చిలకరించిపోయాయి. అప్పుడు మొదలైంది చెట్ల కింద వర్షం. ఆకుపచ్చ చీరకట్టుకున్న చెట్లు వర్షంలో తడిసి స్వచ్ఛంగా, నిర్మలంగా గర్వంతో తల పైకెత్తి నిలబడ్డాయి. కాలం చిత్తరువులా నిలబడిపోయినట్లనిపించింది. కానీ అంతటి ప్రకృతి సౌందర్యంలోనూ 'చిన్నలోపం' కనిపించింది నాకు. ఈసారైనా ఆ లోపాన్ని సరిదిద్దాలనిపించింది నాకు. నా పక్కలో నేను ఇప్పటిదాకా ఒంటరినే. ఇకనుండి జంటగా నువ్వుంటే మరీ బావుంటుంది. మన పిల్లలు ఆ ప్రకృతి ఒడిలో, నీ ఒడిలో నేను ఆడుకుంటూ పడుతూ లేస్తూ సౌందర్యాన్ని అంటించుకుంటూ, దులుపుకుంటూ వుంటే ఆ దృశ్యానికి మరింత పరిపూర్ణత వచ్చి' వుండేది... ..."

xxx.

"గుడ్ మార్నింగ్ నివేదితగారూ" అంటూ విష్ చేశాడు రవి అప్పడే ఆఫీస్‌లోకి వచ్చిన నివేదితను.

"గుడ్ మార్నింగ్" అంటూ రెస్పాన్స్ ఇచ్చి తన సీట్లోకి వెళ్ళిందామె.

'రవి' అంటే ఆ ఆఫీస్‌లో ఎవరికీ సదభిప్రాయం లేదు. 'సకలకళావల్లభుడు' అని చెవులు కొరుక్కుంటారు కానీ 'నిజం' ఆ పైవాడికే తెలియాలి. కానీ ఆఫీస్‌లో వెధవ్వేషాలు ఎప్పుడూ వేయలేదు కాబట్టి నివేదిత అతని గురించి సీరియస్‌గా ఎప్పుడూ ఆలోచించలేదు.

తన టేబిల్ డెస్క్ తెరచిన నివేదిత ఆశ్చర్యపడెంది. తన ఇంటికి వచ్చిన కవర్ లాంటిదే అందులో 'నీట్'గా పెట్టి వుంది. ఒక్కసారి తన నెవరన్నా అబ్జర్వ్ చేస్తున్నారేమో అని తల పైకెత్తి గుండ్రంగా, మెల్లగా తిప్పి చూసింది. తననెవరూ చూడడం లేదని కన్‌ఫర్మ్ చేసుకొని దాన్ని నెమ్మదిగా చింపింది. అందులో "నేటితో ఇరవై ఒక్క వసంతాలు నిండిన తెల్లగులాబికి అన్న కాప్షన్ రాసి వున్న గ్రీటింగ్ కార్డ్, దానికి కుడిచేతి వైపున పిన్ చేయబడ్డ ఓ ఎర్రగులాబి మొగ్గ కనిపించాయి. కొద్దిపాటి తత్తరపాటుతో పెదాలను తడి చేసుకుంటూ మరోసారి తల పైకెత్తి చూసింది. అప్పటికే తల పైకెత్తి ఆమె వైపు చూస్తున్న రవి చిరునవ్వు నవ్వాడు.

కొంపదీసి రవిగాని ఈ గ్రీటింగ్ కార్డ్ పెట్టలేదు కదా! ఇంటికి లెటర్ రాసింది కూడా ఇతనేనేమో అని పరిపరివిధాల ఆలోచించడం ప్రారంభించినది నివేదిత.

కొంచెం ఆలస్యంగా ఆఫీస్‌లోకి అడుగుపెట్టిన కుమార్ అందరినీ విష్‌చేస్తూ నివేదిత వైపు చూస్తూ గుడ్ మార్నింగ్ దేవకన్యగారూ అన్నాడు. ఆఫీస్‌లో జోవియల్‌గా మాట్లాడుతూ, అందరితో కలుపుగోలుగా వుండే కుమార్ అంటే అందరికీ సదభిప్రాయం వుంది.

"ఇదేంటి! నా పేరెప్పుడు మార్చేశారు మీరు?" అంది నివేదిత నవ్వుతూ.

"మీరివాళ ఎర్రగులాబీ అంత అందంగా, వర్షంలో తడిసిన మల్లెమొగ్గంత స్వచ్ఛంగా వున్నారండి. అవసరానికో వేషం వేసే మనం సందర్భాన్ని బట్టి అఫ్టాల్ పేరు మార్చుకుంటే తప్పేముందండి" అన్నాడు కుమార్.

"అలా అయితే మిమ్మల్ని కవిత్వంలో మునిగితేలుతున్న మిమ్మల్ని ఈ రోజు కవికుమార్ అని పిలిస్తే అభ్యంతరం వుండదుగా" అంది నివేదిత.

"నో ప్రోబ్లమ్" అంటూ హాయిగా నవ్వేశాడు కుమార్. తన మీద పడే 'సెటైర్స్'ను లైట్‌గా తీసుకొని స్పోర్టివ్‌గా బిహేవ్‌చేసే అతని ఈ అలవాటు అందరికీ సన్నిహితం చేసింది.

అవుట్ స్పోకెన్‌గా వుండే కుమార్‌గాని ఆ లెటర్స్ రాసి వుండడు గదా అన్న సందేహం వచ్చింది నివేదితకు. కానీ, కుమారుకు పొయిటిక్‌గా రాయగల కెపాసిటీ వున్నా అలాంటి సంతకం లేని ప్రేమలేఖ రాసేటంత పిరికివాడు కాదు అని తనని తాను సమాధానపరచుకుంది. ఆలోచనలతో పరధ్యానంగా వున్న నివేదిత 'మేడమ్ ఎం.డి.గారు మిమ్మల్ని పిలుస్తున్నారు' అన్న ఆఫీస్ బాయ్ కేకతో ఉలిక్కిపడింది.

ముప్పిరిగొంటున్న ఆలోచనలను పారద్రోలుతూ ఎకౌంట్స్ బుక్ తీసుకుని ఎం.డి. వరుణ్ రూమ్‌లోకి వెళ్ళింది.

"ప్లీజ్ బి సీటెడ్!" అన్నాడు వరుణ్ సీట్ వైపు చేయి చూపిస్తూ. మందగమనంతో వెళ్ళి అతని టేబుల్ ముందు సీట్లో కూర్చుంది.

"ఏమిటి ఈ రోజు పరధ్యాన్నంగా వున్నట్లున్నారు!" అడిగాడు వరుణ్.

'జనాలను పట్టించుకోడం ఎప్పటి నుండి మొదలెట్టాడో గురుడు' అని మనసులో అనుకొని "నో సర్! అదేమీ లేదు" అంటూ సమాధానం ఇచ్చింది.

"ఏమిటి ఆ లెటర్స్ గురించే ఆలోచిస్తున్నట్లున్నారు" అన్నాడు వరుణ్. ప్రక్కనే బాంబ్ పేలినట్లు ఉలిక్కిపడింది నివేదిత.

"వాటి విషయం మీకెలా తెలుసు సర్" అనుమానంగా అడిగింది. "ఇంకా అర్థం కాలేదా? అవి రాసింది నేనే" అన్నాడు వరుణ్.

"సర్ మీరా?" సీతారాం కేసరి ప్రధాన మంత్రి అయ్యాడన్న వార్త విన్నంత ఆశ్చర్యంగా అడిగిందామె.

వరుణ్ చెప్పటం ప్రారంభించాడు.

"యస్, నేనే ఆ లెటర్స్ రాసింది నివేదితా! 'ఫూల్ కె పాస్ జాకర్ దేఖో ఖుష్బూ కితనీ ఆతీ హై. మేరీ దిల్ కె కరీబ్ ఆకర్ పూఛో తుమ్హారీ 'యాద్' కితనీ ఆతీ హై' వచ్చిన దగ్గర నుంచి ఫైల్స్‌లో 'ఉష్ట్రపక్షి'లా తలదూర్చి, బిజినెస్ వ్యవహారాల్లో తల మునకలుగా వుంటే నేను అలా రాయగలనని ఊహించి వుండవు కదూ! కమర్షియల్‌గా అనుక్షణం ఆలోచించే నాలో అలాంటి సున్నితమైన భావుకత వుండడం అసాధారణంగా వుందా? జీవితంలో ఉన్నత స్థానాన్ని సాధించాలంటే ఆ మాత్రం కష్టపడక తప్పదు. రక్తంతో ప్రేమలేఖలు రాయడానికి, వెంటపడి కామెంట్స్ చేసి దృష్టిని ఆకర్షించడానికి నేనేమో టీనేజ్‌లో వున్న ఇంటర్‌మీడియట్ కుర్రాడిని కాదు కదా! జీవితం విలువను అర్థంచేసుకున్నవాడిని, స్వంత లక్ష్యాలు నిర్దేశించుకొని వాటి సాధనలో కాలాన్ని క్షణాలుగా లెక్కిస్తూ అనుక్షణం తపిస్తున్న వ్యక్తిని నేను. ప్రేమలో పడడం గొప్ప కాదు. ప్రేమలో నిలబడడం, ప్రేమ కొరకు నిలబడడం ముఖ్యం. డబ్బు సంపాదనలో వున్నవాళ్ళందరూ మెటీరియలిస్టులు కారు నివేదితా!

ఇప్పడైనా నువ్వు లేకుండా నేను బ్రతకలేను లాంటి భారీ డైలాగ్స్ చెప్పను. బ్రతకగలను. కానీ, నువ్వున్నప్పడంత అందంగా, ఆనందంగా మాత్రం జీవితాన్ని జీవించలేనని చెప్పగలను."

అతని గురించి. తాను మల్లికతో అన్న మాటలన్నీ గుర్తొస్తుండగా ఆమె మోములో సన్నని నవ్వు ప్రారంభం అయింది. ఆమె నవ్వులో అతనికి సమాధానం దొరికింది. ●

# ఎవరు గొప్ప?



తది ఎన్నవ స్థానం అంటే ఎన్టీఆర్ ఇలా చెప్పారట!. "సినిమా హిట్‌కు కథ కారణం. దాని రేంజ్‌కి హీరో కావాలి. తీర్చిదిద్దేవాడు దర్శకుడు. వీరిలో ఎవరు ఫెయిలయినా నిర్మాత దెబ్బ తింటాడు" అని ఇటీవల వరుచూరి బ్రదర్స్ ఒక ఇంటర్వ్యూలో తమకెదురైన ప్రశ్నకు తెలివిగా ఈ జవాబుని గుర్తు చేసి తప్పించుకున్నారు. రామాయణం వ్రాసిన వాల్మీకి కంటే రాముడే నీరాజనాలందుకుంటున్నారని వారు కొసమెరుపునిచ్చారు.